బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలి


మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు

రాంనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులు రాజకీయంతో పాటు విద్య, వ్యాపార, సేవా రంగాల్లో కూడా ముందుండాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు సూచించారు. సోమవారం బ్రాహ్మణీయ ఆఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వవైభవం కోసం బ్రాహ్మణులు అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ నీలిమ మాట్లాడుతూ విద్యావంతులైన మహిళలు స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, అధ్యక్షుడు నీలకంఠ, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, ఉపాధ్యక్షుడు రాంచందర్‌రావు, ఫణిరాజ్, డాక్టర్ పద్మావతి, ప్రియదర్శి, కృష్ణవేణి, వాణిరమణ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఏఎంహెచ్‌వో


విద్యానగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ, వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు, అధికారులు

రాంనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ పేర్కొన్నారు. సోమవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని విద్యానగర్ మసీదు వీధిలో డెంగీ వ్యాధికి సంబంధించి విద్యానగర్‌లోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, డెంగీ రాకుండా ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మలేరియా విభాగం రసూల్, సామాజిక కార్యకర్తలు కడప సురేందర్, కె.అనురాధ, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఘాట్ వద్ద మరమ్మతులు


ఎన్టీఆర్ ఘాట్‌ను పరిశీలిస్తున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఘాట్ వద్ద జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఎన్టీఆర్ ఘాట్‌లో జరుగుతున్న పనులను ఆయన టీడీపీ నేతలతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఈ పనులను తాను పార్టీ ఆదేశాల మేరకు పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీని శుభ్రం చేయాలని బీజేపీ నేతల ధర్నా


చెన్నారెడ్డినగర్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

అంబర్‌పేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ చెన్నారెడ్డినగర్‌లో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనుల వల్ల దాదాపు నెల రోజులుగా స్థానికులు డ్రైనేజీ లీకై తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీజేపీ డివిజన్ నేతలు సోమవారం ధర్నా చేశారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో బీజేపీ నేతలు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మించడానికి కాంట్రాక్టర్ జేసీబీతో తవ్వడం వల్ల డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పగిలిపోయాయని విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీని శుభ్రం చేసి రోడ్డు పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు నాగభూషణంచారి, నాయకులు మైలారం రాములు, యశ్వంత్, నవీన్‌రెడ్డి, వెంకటస్వామిగౌడ్, వర్కాల శ్రీకాంత్, దయాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ సోమవారం పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి, బస్తీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. బాపూనగర్‌లో స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను సీసీ రోడ్డు నిర్మించి, పరిష్కరిస్తామన్నారు. ఉమర్‌నగర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు. రఘునాథ్‌నగర్‌లో కుంగిపోయిన మ్యాన్‌హోల్ స్థానంలో నూతన మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


యూపీహెచ్‌సీ సమావేశంలో కార్పొరేటర్లు పద్మావెంకటరెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

వైద్యులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

రాంనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణకు వచ్చే నిధులను సక్రమంగా వాడుకుంటూ బాధ్యతగా ఆస్పత్రి నిర్వహణ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ యూపీహెచ్‌సీ వైద్యులకు సూచించారు. సోమవారం యూపీహెచ్‌సీ నిధులు ఇతరత్ర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి పీఎంవీబీఆర్‌వై పథకం ప్రారంభం

బర్కత్‌పుర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన(పీఎంవీబీఆర్‌వై) పథకను ప్రారంభిస్తుందని బర్కత్‌పురలోని రీజనల్ పీఎఫ్ కమిషనర్ డాక్టర్ శివ్ కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా 3.5 కోట్ల ఉద్యోగాలను సృష్టించి, సామాజిక భద్రత కవరేజ్‌ను విస్తరింపచేయడమే లక్ష్యమన్నారు. ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. బి.రాంబాబును డిస్ట్రిక్ మోడల్ ఆఫీసర్‌గా నియమించినట్లు ఆయన తెలిపారు.

బాధితురాలికి గోల్డ్‌చైన్ అప్పగింత

రాంనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ పోగొట్టుకున్న రెండున్నర తులాల గోల్డ్ చైన్‌ను ముషీరాబాద్ పోలీసులు ఆ బాధితురాలికి అందజేశారు. ముషీరాబాద్ సీఐ జి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... ముషీరాబాద్ పీఎస్ పరిధిలోని హరినగర్‌లో నివాసం ఉంటున్న శిరీష సోమవారం తన క్యారీబ్యాగులో రెండున్నర తులాల గోల్డ్ చైన్ తీసుకుని అబ్బసాయి అపార్ట్‌మెంట్ నుంచి రాంనగర్ వెళ్లింది. కొంత దూరం వెళ్లాక క్యారీ బ్యాగులో గోల్డ్ చైన్ కనపడలేదు. దీంతో ఆమె ఏడుస్తూ ముషీరాబాద్ పీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు హరినగర్ వెళ్లి సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా ఓ బాలుడి వద్ద ఉందని తెలుసుకున్నారు. వెంటనే ఆ బాలుడిని గుర్తించి గోల్డ్‌చైన్‌ను స్వాధీనం చేసుకుని, బాధితురాలు శిరీషకు అందజేశారు. పోయిన గోల్డ్‌చైన్‌ను గంటల వ్యవధిలో గుర్తించి తనకు ఇవ్వడంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం

● ఒకరు అక్కడికక్కడే మృతి ● భార్య, చెల్లెలు, కూతురుకు తీవ్రగాయాలు ● నెక్లెస్‌రోడ్‌లో క్యాంటీన్‌కు వెళ్తుండగా..






మృతిచెందిన అశోక్, ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనం, చికిత్స పొందుతున్న చిన్నారి, స్టీల్ బ్రిడ్జి వద్ద ప్రమాద స్థలం

కవాడిగూడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ద్విచక్రవాహనం స్టీల్ బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య, చెల్లెలు కవిత, కూతురు ఆకాంక్షకు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాయిని నర్సింహారెడ్డి స్టీల్ బ్రిడ్జి దిగుతుండగా రామకృష్ణ మఠం సమీపంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలప్రకారం.. రాంనగర్‌లో ఉండే బి.అశోక్(38), ఆయన భార్య లావణ్య(30) సోదరి కవిత(31), ఆయన కూతురు ఆకాంక్ష(6) కలిసి (ఏపీ09సీకే3289) ద్విచక్రవాహనంపై నెక్లెస్‌రోడ్‌లోని అతనికి సంబంధించిన క్యాంటీన్‌కు వెళ్తున్నారు. రామకృష్ణ మఠం వరకు రాగానే బైక్ అదుపుతప్పి, డివైడర్‌ను బలంగా ఢీకొట్టంతో అశోక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, గాయపడిన ఇద్దరి మహిళలను చికిత్సకోసం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కూతురు ఆకాంక్షను ఇందిరాపార్కువద్ద ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు ఆయన భార్య, సోదరి సురక్షితంగా ఉన్నారని, ఆకాంక్ష తలకు తీవ్ర గాయాలు కావడంతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని పోలీసులు తెలిపారు. అయితే వాహనం అదుపు తప్పి రోడ్డు ప్రమాదం జరిగిందా లేక వెనకాల నుంచి ఏదైనా వాహనం ఢీకొట్టిందా అనే కోణంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతి


జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు

ముషీరాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సత్వరం పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, పార్టీ సీనియర్ నాయకులు సంగపాక వెంకట్, అభిషేక్ కెనడి మాట్లాడుతూ... ముషీరాబాద్‌లోని సాగర్‌లాల్ ఆసుపత్రి చౌరస్తా నుంచి దాయర మార్కెట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు, ఇందిరానగర్ ఫస్ట్ వెంచర్‌లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను, భోలక్‌పూర్ స్టీల్‌షాపు నుంచి కుతుబ్‌షాహీ మోహల్లా వీధి వరకు రోడ్లు వేయాలని కోరారు. బాకారంలోని మల్లన్న దేవాలయం నుంచి భోలక్‌పూర్ స్టార్ హోటల్ వీధి వరకు స్పీడ్ బ్రేక్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరా పార్కులో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం దిమ్మె పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, పునఃనిర్మించాలని పేర్కొన్నారు. సిద్ధిక్‌నగర్‌లో నాలా పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అంజుమన్ స్కూల్ వీధిలో ఏపుగా పెరిగిన చెట్లకొమ్మల వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాటిని తొలగించాలని కోరారు. ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను సత్వరం పూర్తిచేయాలన్నారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ సూచన మేరకు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్‌చాంద్, కరీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


అభినవ ఫూలే రాహుల్‌గాంధీ : వీహెచ్


అలీకేఫ్ చౌరస్తాలో రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు

అంబర్‌పేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీసీల అభ్యున్నతిని ఆకాంక్షించిన నాయకుడు రాహుల్‌గాంధీ అని బీసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో బీసీకులగణన చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీసీల రిజర్వేషన్ల కోసం రాహుల్ గాంధీ కృషిచేశారని పేర్కొంటూ ఆయన చిత్రపటానికి సోమవారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా 4,500 కిలో మీటర్లు పాదయాత్ర నిర్వహించి, బీసీల స్థితిగతులను గుర్తించారని అన్నారు. 19వ శతాబ్దంలో బీసీల కోసం పూలే పనిచేస్తే 21వ శతాబ్దిలో బీసీల అభ్యున్నతి కోసం రాహుల్‌గాంధీ పాటుపడుతున్నారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ అభినవ పూలే అని ఆయన అభివర్ణించారు. 21వ శతాబ్దంలో బీసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న రాహుల్‌గాంధీ చిత్రపటానికి 21 బిందెలతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో క్షీరాభిషేకం చేశామన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలతో దేశంలో మొదటిసారిగా బీసీ కులగణన చేపట్టి అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ఆర్డినెన్స్ విడుదల చేస్తే ప్రతిపక్షాలు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రధాని మోదీ స్వయంగా ఓబీసీ అయినప్పటికీ బీసీల రిజర్వేషన్ల కోసం ఏమి కృషి చేశారని ఆయన ప్రశ్నించారు. బీజేపీ అధికారంలో ఉన్న యూపీలో ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తూ తెలంగాణలో ముస్లింలకు రిజర్వేషన్ ఇవ్వడాన్ని ఎలా ప్రశ్నిస్తారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పులిజగన్, దిడ్డి రాంబాబు, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, శ్రీధర్‌గౌడ్, షేక్ జమీర్ పాల్గొన్నారు.

జీవో 44 ప్రకారం విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

- ఏహెచ్‌ఆర్‌జీ హైదరాబాద్ అధ్యక్షుడు శ్యామ్


డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న సిరిగిరి శ్యామ్

రాంనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వం జీవో 44 ప్రకారం ఉచిత విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉచితవిద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆలిండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సిరిగిరి శ్యామ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఈ అంశంపై హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాంనగర్‌లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ పాఠశాలలు విద్యా హక్కు చట్టం 2009 అమలు చేయడం లేదన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రతి పాఠశాల యాజమాన్యం 1వ తరగతి నుంచి 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని ఉందన్నారు. ఈ 25 శాతంలో దివ్యాంగులు, అనాథలు, హెచ్ఐవీ బాధితులకు 5 శాతం సీట్లు, ఎస్సీ విద్యార్థులకు 10 శాతం, ఎస్టీ విద్యార్థులకు 4 శాతం, బీసీ విద్యార్థులకు 6 శాతం సీట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ద్వారా రాష్ట్రాలకు తెలియజేసిందన్నారు. కానీ రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఈ జీవోను అమలు చేయకుండా మొత్తం సీట్లను తమ ఇష్టం వచ్చిన ఫీజులను భర్తీ చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. తమ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డీఈవోకు విన్నవించామన్నారు.

ప్రజలకు వైద్య సేవ చేయడానికి కృషి చేయాలి

బర్కత్‌పుర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడానికి జన ఆరోగ్య సమితి కృషిచేస్తుందని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. సోమవారం జన ఆరోగ్య సమితి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నె ఉమాదేవి మాట్లాడుతూ... వర్షాకాలంలో వివిధ రకాల వ్యాధుల బారిన ప్రజలు పడే ప్రమాదం ఉందని, వారిని నిరంతరం అప్రమత్తం చేస్తూ అన్ని ప్రాంతాలలో ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిబాబా, డాక్టర్ మనోజ్‌రెడ్డి, డాక్టర్ వసంత కుమార్, తిరుపతి నాయక్, ఆశావర్కర్లు, టీచర్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఆజామాబాద్ ఐఈ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఆర్‌వోఎం పరిధిలో 12 నుంచి మధ్యాహ్నం 1 వరకు, ప్రివెంటివ్ మెడిసిన్ పరిధిలో 2నుంచి సాయంత్రం 4 గంటల వరకు, నారాయణగూడ పరిధిలో 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ముషీరాబాద్ సర్కిల్ స్లమ్ లెవెల్ ఫెడరేషన్ కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా పద్మ, రేఖారెడ్డి


ముషీరాబాద్ డీఎంసీ రామానుజులరెడ్డి, యూసీడీ అధికారి సుధాకర్‌తో సర్కిల్ స్లమ్ లెవెల్ ఫెడరేషన్ నూతన కమిటీ సభ్యులు

రాంనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ సర్కిల్ స్లమ్ లెవెల్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. సోమవారం సర్కిల్ కార్యాలయంలో డీఎంసీ రామానుజులరెడ్డి, యూసీడీ అధికారి సుధాకర్ సమక్షంలో జరిగిన ఎన్నికలో 24 మంది స్లమ్ లెవెల్ ఫెడరేషన్ సభ్యుల్లో 17 మంది సభ్యులు హాజరయ్యారు. అధ్యక్షురాలిగా ఎ.పద్మ, ప్రధానకార్యదర్శిగా రేఖారెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.విమల, సంయుక్త కార్యదర్శిగా పుష్పలత, కోశాధికారిగా టి.పుష్ప, కమిటీ సభ్యులుగా ఎన్.రాజేశ్వరిగౌడ్, వై.నీరజ, ఎస్.సరిత, జి.విక్టోరియారాణి, విజయలక్ష్మి, లావణ్య, ప్రియ తదితరులు ఎన్నికయ్యారు. వీరి పదవీ కాలం ఐదు సంవత్సరాల పాటు ఉండనున్నది.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : డీఎంసీ

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, మహిళల సంక్షేమం, స్వయం ఉపాధి కోసం చేపడుతున్న పథకాలను మహిళలకు తెలియజేసి, అర్హులైన వారికి అందించేలా నూతన స్లమ్ లెవెల్ ఫెడరేషన్ కమిటీ కృషిచేయాలని ముషీరాబాద్ డీఎంసీ రామానుజులరెడ్డి సూచించారు. నిబంధనల ప్రకారం కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి సమావేశానికి కమిటీ సభ్యులందరూ హాజరు కావాలని, రాని వారిని నిబంధనల ప్రకారం తొలగించి, కొత్త వారికి అవకాశం కల్పించాలన్నారు.

భారత్ సేవాశ్రమ్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులు, వరద బాధితులను ఆదుకునేందుకు భారత్ సేవాశ్రమం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అన్నారు. భారత్ సేవాశ్రమం ఆధ్వర్యంలో సోమవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ పంకజ్ మెమోరియల్ ప్రభుత్వ పాఠశాలతోపాటు మరో పాఠశాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఉచితంగానోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ జి.రచనశ్రీ, భారత్ సేవాశ్రమ్ నగరకార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భారత్ సేవా శ్రమ్ ఆధ్వర్యంలో నిరంతరం సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వారిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నతపాఠశాలలతోపాటు వివిధ పాఠశాలలకు ఉచితంగా నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ విద్యార్థులకు ఉచితంగా షూస్ పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భారత్ సేవా ఆశ్రమ్ సిబ్బందితోపాటు మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమల్‌కుమార్, నగర నాయకులు ఎంసీ.మహేందర్‌బాబు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధానకార్యదర్శులు కేశవరాజు, బొల్ల రమేష్, ఓబీసీమోర్చా డివిజన్ అధ్యక్షుడు ఎ.ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీ సీనియర్ నాయకులు కుమార్‌గౌడ్, అనిల్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

నల్లకుంట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చి అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వి.రాకేష్, పెద్దింటి రామకృష్ణ ఆరోపించారు. సోమవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్లు వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేయాలని, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిసకాకుండా వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.ప్రదీప్, వి.అజయ్ నూతన కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైనట్లు ప్రకటించారు.

పీవైఎల్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక



ఎన్‌వీ.రాకేష్, పి.రామకృష్ణ

పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్‌వీ.రాకేష్(ఖమ్మం), ప్రధానకార్యదర్శి పెద్దింటి రామకృష్ణ (నారాయణపేట్), ఉపాధ్యక్షులుగా ఎం.రవికుమార్(హైదరాబాద్), ప్రతాప్(నారాయణపేట్), జె.భరత్(ఖమ్మం), కార్యదర్శులుగా టీఎస్.కృష్ణ(హైదరాబాద్), కుర్సా రామకృష్ణ(భద్రాద్రీ), పెండ్యాల రమేష్(పెద్దపల్లి), కోశాధికారిగా నవీన్ (నిజామాబాద్)లతోపాటు సభ్యులుగా 21 మంది ఎన్నికయ్యారు.

మేజర్ కవితకు సత్కారం



భారతసైన్యంలో వైద్యాధికారిగా సేవలు అందిస్తున్న ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన మేజర్ కవిత వసుమల్లి ఇటీవల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటేరింగ్ అండ్ అడ్వంచర్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రహ్మపుత్రనది రివర్ రాఫ్టింగ్ ఎక్స్ పేడేషన్‌లో పాల్గొన్నారు. 28 రోజుల్లో వెయ్యి 40 కిలోమీటర్లు రివర్ రాఫ్టింగ్ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఆమెను సోమవారం రాంనగర్ తన నివాసంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సన్మానించారు. (రాంనగర్, ఆంధ్రజ్యోతి)

స్వచ్ఛంద సంస్థల సేవలు స్ఫూర్తిదాయకం


సంస్థను ప్రారంభిస్తున్న నరేందర్‌గౌడ్ తదితరులు

చిక్కడపల్లి, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు స్ఫూర్తి దాయకమని నిమ్మల రాములు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నిమ్మల నరేందర్‌గౌడ్ అన్నారు. చలకుర్తి(నాగార్జునసాగర్) మాజీ ఎమ్మెల్యే నిమ్మల రాములు పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి రిజిష్టర్ కావడంతో సోమవారం చిక్కడపల్లిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వంగాల బాల్‌రాజ్‌గౌడ్. ప్రధానకార్యదర్శి మదన్‌మోహన్, కోశాధికారి నిమ్మలసంధ్య, సంయుక్తకార్యదర్శి పంతంగి రవి, సభ్యులు కృష్ణ, శేఖర్‌మేరు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు విలువైనవి : ఎమ్మెల్యే గోపాల్


మహేష్‌బాబుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

చిక్కడపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పోలీసులు సమాజానికి అందిస్తున్న సేవలు విలువైనవని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. డీఎస్పీ జిదుల మహేష్‌బాబు సంస్మరణ సభ సోమవారం గాంధీనగర్ జరిగింది. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ డీఎస్పీగా మహేష్‌బాబు మంచి పేరు సంపాదించారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముఠా నరేష్, గడ్డమీది శ్రీనివాస్, బండారి ఉమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటరెడ్డికి నివాళులర్పిస్తున్న పార్వతీశం, త్రినాథరావు తదితరులు

వెంకటరెడ్డి చిరస్మరణీయుడు

చిక్కడపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గుదిబండి వెంకటరెడ్డి చిరస్మరణీయుడని ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం అన్నారు. శ్యామగాయత్రి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగాన సభలో జీవీఆర్ ఆరాధన అధ్యక్షుడు గుదిబండి వెంకటరెడ్డి సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పార్వతీశం మాట్లాడుతూ వెంకటరెడ్డిని సాంస్కృతిక భీష్ముడుగా అభివర్ణించారు. సభాధ్యక్షత వహించిన ప్రముఖ గాయకుడు, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం డా.చింతలపూడి త్రినాథరావు మాట్లాడుతూ సాంస్కృతికరంగానికి వెంకటరెడ్డి అందించిన సేవలు అనన్యసామాన్యమని అన్నారు. సభలో శ్యామగాయత్రి సంస్థ అధ్యక్షురాలు చిల్లా శివపార్వతి, రేణుకాప్రభాకర్, వెంకట్రావు పాల్గొన్నారు. సభకు ముందు కల్యాణ్, రాదారాణి, రఘు, భరణి, శ్రీనివాసమూర్తి, అర్జున్, మహేష్ తదితర గాయనీగాయకులు వెంకటరెడ్డికి స్వరనివాళి అర్పించారు.